# మంచి వార్త



## చినార్ చెట్ల మనిషి

**పల్లెలు, పట్నాలు** అనే తేడా లేకుండా ప్రతిచోటా పచ్చదనం మాయమైపోతున్నది. ఎక్కడచూసినా కాంక్రీట్ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇక జమ్ముకశ్మీర్ పేరు చెప్పగానే ఎత్తయిన హిమాలయాలు, వాటి మధ్యలో ఒదిగిపోయిన సరస్సులు, జీలం నది ఒంపులతో ఒయ్యారాలు ఒలికించే లోయలు, కుంకుమ పూల ఉద్యానవనాలు కండ్ల ముందు మెదుల్తాయి. కశ్మీర్ అంటే ఇవి మాత్రమే కాదు... చినార్ చెట్టు కూడా. అక్కడి ప్రజలు ఈ చెట్టును వారసత్వ సంపదగా భావిస్తారు. ఇలా ఉంటే వివిధ కారణాల వల్ల కశ్మీర్ సరిహద్దు జిల్లా కుప్వారాలో పచ్చదనం క్రమంగా క్షీణిస్తున్నది. ఈ దుస్థితి ఓ రోజుకూలీకి బాధ కలిగించింది. దాంతో ఆయన చినార్ చెట్ల పెంపకం ద్వారా తమ ప్రాంతానికి పచ్చదనాన్ని తిరిగి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాడు. ఆయన పేరు అబ్దుల్ అహద్ ఖాన్. 40 ఏండ్ల ఖాన్‌ను స్థానికులు 'చినార్ చెట్ల మనిషి' అని ప్రేమగా పిలుచుకుంటారు. పదిహేనేండ్లుగా ఆయన తన సొంతఖర్చులతో వందలాది చినార్ మొక్కలను పెంచుతున్నాడు. ''నా చిన్నతనం నుంచే నాకు చినార్ చెట్లంటే ఒక రకమైన ఇష్టం ఏర్పడింది. ఇప్పుడు నా కలను సాకారం చేసుకుంటున్నాను'' అంటాడు అబ్దుల్ అహద్. కుప్వారా జిల్లా నగ్రికి చెందిన ఆయన తన గ్రామాన్ని చినార్ చెట్ల అరణ్యంగా మార్చేశాడు. హత్ముల్లా అటవీ ప్రాంతంలో 20 హెక్టార్ల స్థలంలో 300కుపైగా చినార్ చెట్లను పెంచి పెద్దచేశాడు. స్థానికంగా బోయెన్ అని పిలుచుకునే చినార్ చెట్టు దాదాపు 60 అడుగులకు పైగా ఎత్తు పెరుగుతుంది. దీని మాను చుట్టుకొలత 50 అడుగుల వరకు చేరుకుంటుంది. ''పదిహేనేండ్లుగా వేలాది చినార్ చెట్లు నాటాను. అడవులు సుసంపన్నంగా ఉండాలి. మనకు అవెంతో ఆహ్లాదాన్ని ఇస్తాయి'' అని అబ్దుల్ అహద్ సంతోషంగా చెబుతాడు. తన పరిసరాల్లో ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపించినా ఆయన దాన్ని చినార్ చెట్లతో నింపేస్తాడు. ఆయన కృషిని అటవీ శాఖ కూడా గుర్తించింది. తన ఊపిరి ఉన్నంతవరకు చినార్ చెట్లను పెంచుతూనే ఉంటాను అని సంకల్పించుకున్న అబ్దుల్ అహద్ అభినందనీయుడు.

## వైతాళికుల వాణి

ఒక్కరోజైనా జీవితంలోని చిన్నచిన్న సంఘటనలను తలుచుకుని ఆనందించండి. వెనక్కి చూసుకుంటే మీకు అవే ఎంతో గొప్పగా అనిపిస్తాయనేది సత్యం.

• **నానీ పాల్కీవాలా**

(న్యాయశాస్త్ర కోవిదుడు)

## క్యా సీన్ హై!

